క్లుప్తంగా

సత్వర పరిష్కార వేదిక 'డయల్ యువర్ ఎమ్మెల్యే'



పెదకూరపాడు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మక్కెన సాగర్ తెలిపారు. గారపాడు గ్రామంలో టీడీపీ నాయకుడు పెనుముచ్చు రామారావు, కూటమి పార్టీల కార్యకర్తలతో డయల్ యువర్ ఎమ్మెల్యే గోడ ప్రతులను గురువారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తీసుకొచ్చిన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒక్క ఫోన్ కాల్‌తో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పాకలపాడులో పారిశుద్ధ్యం



సత్తెనపల్లి: వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మండలంలోని పాకలపాడు గ్రామంలో మురుగు తొలగింపు ప్రక్రియను గురువారం చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించారు. డ్రెయినేజీలను శుభ్రపరిచారు. గ్రామ నాయకుడు షేక్ నన్నేసా పర్యవేక్షించారు.

బాధితుడికి పరామర్శ

అచ్చంపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చెరుకుంపాలెంలోని స్వగృహంలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సారెడ్డి నాగిరెడ్డిని జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి గురువారం పరామర్శించారు. పార్టీ పరంగా ఆదుకుంటామని, అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఎంపీటీసీ సుంకర శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ చింతగుంట్ల హనుమంతురెడ్డి ఉన్నారు.

ఆర్టీఐ యాక్ట్‌పై అవగాహన

ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర సమాచార కమిషనర్ ఉత్తర్వుల మేర సమాచార హక్కు చట్టంపై రైతులకు, మండలస్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశం, ఉపయోగాలు, లక్ష్యాలు, చట్టం పరిధి గురించి తహసీల్దార్ ఎం.భవాని శంకర్, మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీ ప్రసాదు, రెవెన్యూ సిబ్బంది, ఆయా శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పాములతో జాగ్రత్త



పెదకూరపాడు: వరదల అనంతరం ఎక్కడ చూసినా ప్రమాదకర విష సర్పాలు సంచరిస్తున్నాయి. గురువారం ఉదయం 75 త్యాళ్లూరు గ్రామానికి చెందిన రైతు ములకా సీతారామిరెడ్డి భార్య సునీతతో కలిసి పొలం గట్టుమీద గడ్డి కోస్తున్న సమయంలో రక్త పింజర కాటు వేసింది. వెంటనే ఆసుపత్రిలో చేర్పించగా.. ప్రాణాపాయం తప్పింది. పీహెచ్‌సీల్లో పాము కాటుకు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ వెలుగొండారెడ్డి తెలిపారు. పశువుల పాకలు, గడ్డి వాములు, పాఠశాల మైదానాల్లో కూడా పాముల బెడద ఉంటుందని జాగ్రత్తగా ఉండాలన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.1,30,000 రూపాయలు మెరిట్ స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడం జరిగింది. పాఠశాలలో 2023 మార్చిలో 6 నుంచి 10వ తరగతి వరకు జరిగిన పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మొదటి బహుమతి క్రింద రూ.15,000 రూపాయలు, ద్వితీయ బహుమతి క్రింద రూ.12,000 రూపాయలు, అదే విధంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2,500 రూపాయలు, రూ.2,000 రూపాయలు పంపిణీ చేయడం జరిగింది. అదే విధంగా మండలంలో 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు రూ.12,000 రూపాయలు విలువ జేసే బహుమతులు అందజేసినారు. వివిధ క్రీడలలో గెలుపొందిన 90 మంది విజేతలకు రూ.30,000 రూపాయలు విలువ కలిగిన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శివప్రసాద్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఉండ్రాళ్లయ్యా.. ఉంటామయ్యా!

- వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు, అన్న సంతర్పణలు
- ఉత్సాహంగా నిమజ్జన ఊరేగింపులు
- కనుల పండువగా శోభాయాత్ర
- పోలీసు శాఖ పకడ్బందీ ఏర్పాట్లు

సత్తెనపల్లి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని వినాయక మండపాల్లో 6వ రోజు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు రోజులపాటు భక్తుల నుంచి విశేష పూజలు అందుకున్న కొన్ని వినాయక విగ్రహాలను గురువారం గంగమ్మ ఒడికి చేర్చారు. నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువగ సాగింది. ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాలు .. గణపతి బప్పా మోరియా నినాదాలతో మారుమోగింది. యువతీ, యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా కనిపించారు. సత్తెనపల్లి పట్టణంలోని పాత బస్టాండ్‌తో పాటు పలు మండపాల్లో వినాయక విగ్రహాలను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద అన్న సంతర్పణ చేశారు. నిమజ్జనోత్సవం సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోలాహలంగా నిమజ్జనాలు

పెదకూరపాడు: గారపాడు గ్రామంలో మాజీ సర్పంచ్ గణేష్ మాధవరావు ఆధ్వర్యంలో వినాయక విగ్రహ శోభయాత్ర నిర్వహించారు. చిన్నారుల కోలాటం, భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేలం పాటలో లడ్డూ ప్రసాదాన్ని రూ.25,001కు గ్రామానికి చెందిన రైతు దక్కించుకున్నారు.

అలరించిన సాంస్కృతి కార్యక్రమాలు

నకరికల్లు: దేచవరం గ్రామంలో విఘ్నేశ్వర మండపం వద్ద బుధవారం రాత్రి విశేష పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. దేవతామూర్తుల వేషధారణలో నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్త బృందం స్వామి వారి కీర్తనలు ఆలపించారు. స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. స్థానిక చౌత్రా సెంటర్ విఘ్నేశ్వరుని నిమజ్జన బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామి లడ్డూ ప్రసాదాన్ని రూ.96 వేలకు వేలంలో గునుగుంట్ల నర్సింహారావు దక్కించుకున్నారు.



సత్తెనపల్లి 14వ వార్డులో పూజలందుకున్న గణనాథుడు



సత్తెనపల్లి పాత బస్టాండ్‌లో స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



నకరికల్లు: దేచవరంలో దేవతామూర్తుల వేషధారణ

లడ్డూ వేలం



క్రోసూరు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానం ఆవరణలో ఆర్యవైశ్య సంఘం ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ ప్రసాదాన్ని రూ.30,116 కు భక్తుడు అనుమాల పూర్ణచంద్రరావు కైసవం చేసుకున్నారు. బుధవారం రాత్రి 15 కిలోల లడ్డూ ప్రసాదం వేలం పాట నిర్వహించారు. ఆర్యవైశ్యులు ప్రముఖులు, మహిళలు ఆశేషంగా పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంతో ఆటలొద్దు



పాఠశాలలో నిరుపయోగంగా ఆర్వో ప్లాంటు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాలలో గత ప్రభుత్వం మన బడి నాడు–నేడు నిధులు రూ.8 లక్షలతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసింది. ఇది గత రెండు నెలలుగా నిరుపయోగంగా మూలన పడింది. దీంతో విద్యార్థులు బోరు నీటినే వాడుతున్నారు. స్కూల్ మానిటరింగ్ ఫండ్ కింద గత ప్రభుత్వం రూ.6.68 లక్షలు మంజూరు చేసింది. అందులో రూ.4 లక్షలు వివిధ మరమ్మతుల కింద ఖర్చు చేశామని ప్రిన్సిపల్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఇంకా రూ.2.68 లక్షలు మిగిలి ఉన్నాయి. కానీ, ఆర్వో ప్లాంటు మరమ్మతులు చేపట్టడం లేదు. పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదివే విద్యార్థులు 600కు పైగా ఉన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛమైన తాగునీటి అందించేందుకు ఆర్వో ప్లాంటుకు తక్షణమే మరమ్మతులు చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక దాడులు

116 మందికి రూ.7.34 లక్షల అపరాధ రుసుం



వివరాలు వెల్లడిస్తున్న విజిలెన్స్ అధికారులు

బెల్లంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పాపాయపాలెం, బెల్లంకొండ, కొత్తపాలెం, మన్నె సుల్తాన్‌పాలెం, న్యూ చిట్యాల, మాచాయపాలెం గ్రామాల్లో మొత్తం 50 బృందాలుగా ఏర్పడి ఏక కాలంలో తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి జరిమానా విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.సూర్య ప్రకాశ్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.హరిబాబు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 4,152 సర్వీసులు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. కాగా మాల్ ప్రాక్టీస్, అదనపు లోడుకు సంబంధించి అందులో 116 మందికి రూ.7.34 లక్షల ఫైన్ వేసినట్లు తెలిపారు. ఎవరైనా విద్యుత్ దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో డీఈఈలు ఎం.రవికుమార్, ఎం.బాబ్జీనాయక్, కె.రవికుమార్, ఏఈలు కె.కోటేశ్వరరావు, చంద్రశేఖర్ ఆపరేషన్ ఏఈ డి.పవన్ కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంపై శిక్షణ



వివరిస్తున్న ఏడీఏ వి.హనుమంతరావు



శిక్షణలో మాట్లాడుతున్న ఏఎస్‌ఓ శివబాబు

క్రోసూరు: మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖాధికారి కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ వి.హనుమంతరావు మాట్లాడుతూ రైతు సేవా కేంద్ర సిబ్బంది పంట కోత ప్రయోగాలు నిర్వహించే విషయంలో అశ్రద్ధ వహించొద్దని తెలిపారు. దిగుబడి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఏఎస్వో పి.ఝాన్సీరాణి వివిధ పంటల కోత ప్రయోగం విధానాలను వివరించారు. నిర్వహించే పద్ధతిని వివరించడం జరిగింది. కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

సత్తెనపల్లి: పంటకోత ప్రయోగాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సత్తెనపల్లి ఏఎస్‌ఓ ఎం.శివబాబు అన్నారు. వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు పంటకోత ప్రయోగాలపై పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లో గురువారం నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏఎస్‌ఓ శివబాబు మాట్లాడుతూ వరి, పత్తి, మిరప పంటల్లో వారికి కేటాయించిన యూనిట్ల వారీగా పంట కోత ప్రయోగాలు చేపట్టాలన్నారు. ప్రయోగం నిర్వహణ, యాప్‌లో వివరాల నమోదును వివరించారు. ఏఓ ఎస్.శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

దమ్మాలపాడులో పోషణ మహోత్సవం



పోషణ మహోత్సవంలో సూపర్‌వైజర్ జయలక్ష్మి

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సత్తెనపల్లి పరిధిలో గల ఇరుకుపాలెం సెక్టార్‌లోని దమ్మాలపాడు గ్రామంలో పోషణ మహోత్సవం కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి పాల్గొన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించడం, ఏడవ నెల నుంచి తల్లిపాలు కొనసాగిస్తూ అనుబంధ పోషకాహారం మొదలు పెట్టడం గురించి అవగాహన కల్పించారు. పిల్లలకు తల్లిపాలు పట్టించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పి.పద్మావతి, పి.బుజ్జిరాణి, టి.ప్రమీల, డి.రమాదేవి, సీహెచ్ సుమలత, ఎల్.శ్రీదేవి, తల్లులు, కిశోర బాలికలు పాల్గొన్నారు. కుందురువారిపాలెంలో జరిగిన పోషణ మహోత్సవంలో ఐసీడీఎస్ సీడీపీవో డి.శ్రీలత పాల్గొని, తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యూడైస్ ప్లస్‌లో పూర్తి సమాచారం నింపాలి



మాట్లాడుతున్న ఎంఈవో బాలసుందరరావు

బెల్లంకొండ: మండలంలోని అన్ని పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారం యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని ఎంఈఓ బాలసుందరరావు తెలిపారు. గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని పాఠశాలల సమాచారం ఈ నెల 27 లోగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఏ విధంగా నమోదు చేయాలనే అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ కల్పించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎడిట్ ఆప్షన్ లేదని, తప్పులతో సమాచారం నింపితే హెచ్ఎంలే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ పాఠశాలల హెచ్ఎంలు శాంతి, శీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వడ్డవల్లిలో ఇద్దరు యువకులపై కత్తులతో దాడి

- ఒకరి పరిస్థితి విషమం
- పాత కక్షలు నేపథ్యంలో ఇరు వర్గాల వాగ్వివాదం
- ఏడుగురిపై హత్యాయత్నం కేసు నమోదు



ఏరియా వైద్యశాలలో క్షతగాత్రుడు వెంకటేష్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ సంధ్యారాణి

సత్తెనపల్లి: ఇద్దరు యువకులపై కత్తులతో దాడి జరిగిన ఘటన సత్తెనపల్లి పట్టణంలోని వడ్డవల్లిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వడ్డవల్లి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం దగ్గర రాచమంటి పవన్ కల్యాణ్, కరాటి వెంకటేష్, పగడాల అంజి, జక్కుల బ్రహ్మం ఉన్నారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి అచ్యుత్, గొల్లపల్లి జీవన్ మద్యం తాగి వేగంగా వచ్చారు. దీంతో ఇక్కడ జనం ఎక్కువగా ఉంటే ఎందుకు అంత వేగంగా వెళ్తున్నారని పవన్ కల్యాణ్ ఇతరులు ప్రశ్నించారు. వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడి నుంచి వెళ్లిపోయిన అచ్యుత్, జీవన్ అర్ధరాత్రి సమయంలో గర్నెపూడి పవన్, గురజాల విజయ్ కుమార్, మల్లెం వెంకటేష్, దాసరి కోటేశ్వరరావు, ప్రవీణ్‌లతో మళ్లీ వచ్చి కత్తులతో దాడి చేశారు. ఈ దాడిలో కర్నాటి వెంకటేష్‌కు ఎడమ చేతి పైన, నుదుటిపై కత్తి పోట్లు పడ్డాయి. రాచమంటి పవన్ కల్యాణ్‌కు రెండు కత్తి పోట్లు దిగడంతో హుటాహుటిన క్షతగాత్రులను పట్టణంలోని ఏరియా వైద్యశాలకు తరలించి, ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. క్షతగాత్రుల్లో కరాటి వెంకటేష్ పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరూ గుంటూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుడు పవన్ కల్యాణ్ ఫిర్యాదు మేరకు గొల్లపల్లి అచ్యుత్, గొల్లపల్లి జీవన్, గర్నెపూడి పవన్, గురజాల విజయ్ కుమార్, మల్లెం వెంకటేష్, దాసరి కోటేశ్వరరావు, ప్రవీణ్‌లపై హత్యాయత్నం కింద పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యా రాణి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పాత కక్షల నేపథ్యంలో జరిగిన ఈ ఘటన పట్టణంలో కలకలం రేపింది.

తక్కువ ఖర్చుతో పౌష్టికాహారం తీసుకోవాలి

ఉయ్యందన(క్రోసూరు): గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న ఆహారం తీసుకోవాలని తద్వారా రక్తహీనత నివారించుకోవచ్చని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ మహీ మున్నీసా తెలిపారు. గురువారం ఉయ్యందన గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వారికి అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పెరట్లో ఆకు కూరలు, కూరగాయాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే కోడిగుడ్లు తీసుకోవాలని కోరారు. గ్రామ సర్పంచ్ మంకు వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

నరుకుళ్లపాడు చెరువులో మహిళ మృతదేహం



అమరావతి: మండలం పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామ సచివాలయ సమీప చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహన్ని గురువారం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చెరువులో తేలాడుతున్న మృతదేహన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం అమరావతి సీహెచ్‌సీకి తరలించారు. సుమారు 45 ఏళ్ల వయస్సు గల మహిళనలుపు చాయలో ఉందని, ఎత్తు 5.2 అడుగులు ఉన్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆత్మహత్య చేసుకుందా లేక ఎవరైనా హత్య చేసి చెరువులో పడేశారా అనే కోణంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. పత్తెనపల్లిలో మహిళ మిస్సింగ్ కేసు నమోదయ్యిందని, వారికి సమచారం అందించామని తెలిపారు.

శావల్యాపురంలో ఆటో చోరీ

శావల్యాపురం: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. శావల్యాపురం గ్రామానికి చెందిన దూదెకుల పెద సైదాకు చెందిన ఆటోను కనక దుర్గమ్మ దేవాలయం ప్రధాన కూడలి మార్గంలో రోడ్డు పక్కన పార్కింగ్ చేశాడు. ఇదే క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటోను చోరీ చేసినట్లు గుర్తించారు. అయితే చోరీకు పాల్పడిన వ్యక్తులు సెంటరులో ఉన్నదుకాణాల్లో మరో చోరీ చేయడానికి ప్రయత్నాలు చేసినట్లు స్థానికులు తెలిపారు. ఆటో చోరీకు గురైన విషయాన్ని గురువారం స్థానిక పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు సారథ్యంలో ప్రధాన కూడలి మార్గాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిలించారు. పోలీసులు చాలెంజ్‌గా తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మండలంలో ఇటీవల వరుసగా బైకులు చోరీలకు అవుతున్నాయి. ప్రధాన సెంటరు పార్కింగ్ చేసిన ఆటో చోరీ జరగటంపై ప్రజల్లో తీవ్ర చర్చనీయంగా మారింది.

లడ్డూ వేలం.. రూ.3.10 లక్షలు



స్థానిక అచ్చం పేట రోడ్డులోని కోటమ్మ సత్రం వద్ద గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లడ్డూ ప్రసాదానికి గురువారం రాత్రి వేలం పాట నిర్వహించారు. రూ. 3.10 లక్షలకు పట్టణానికి చెందిన దేవతి శివప్రసాద్ 27 కేజీల లడ్డూను దక్కించుకున్నారు. ఆయనకు వినాయకుడి లడ్డూతో పాటు హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని కూడా అందించారు.

–సత్తెనపల్లి

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

బెల్లంకొండ: మహిళల్లో రక్త హీనతను నివారించాలంటే తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని బెల్లంకొండ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ తెలిపారు. గురువారం చంద్రాజుపాలెం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పోషణ అభియాన్, వ్యాధి నిరోధక టీకాలపై తల్లులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తయారు చేసుకోవాలని సూచించారు. గర్భిణులు సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల బిడ్డ ఎదుగుదల కూడా తగ్గి, అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఐరన్ మాత్రలు, బాలామృతం, పప్పు, బెల్లం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లేశ్వరి, విజయకుమారి, శోభారాణి, సీత, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక వర్గ రాజ్య స్థాపనకు సీతారాం ఏచూరి కృషి

సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్



సభలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్ కుమార్



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి


సత్తెనపల్లి: కార్మికవర్గ రాజ్య స్థాపనకు అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో గురువారం జరిగిన సీతారాం ఏచూరి సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అధ్యక్షత వహించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో పుట్టిన సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి మార్క్సిజంకు ఆకర్షితులయ్యారన్నారు. సమ సమాజ నిర్మాణం కోసం మార్క్సిస్టు పార్టీని నిర్మించేందుకు అహర్నిశలు కృషిచేశారన్నారు. విద్యార్థి నాయకుడిగా, విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, సీపీఎం కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యులుగా, ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా పార్టీ విషయాల పట్ల సైద్ధాంతికంగా, రాజకీయ సమున్నత స్థానానికి ఎదిగారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు మనమందరము కృషి చేయడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళులన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య మాట్లాడుతూ జేఎన్‌యులో విద్యార్థి ఉద్యమ అధ్యక్షుడిగా పనిచేసిన సీతారాం ఏచూరి అనేక విద్యార్థి ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు. సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, న్యాయవాది పిన్నమనేని పాములయ్య మాట్లాడారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. సీపీఎం నాయకులు వీర బ్రహ్మం, శివ దుర్గారావు, గద్దె ఉమాశ్రీ, మునగాజ్యోతి, పుల్లారావు, ప్రభాకర్, సూర్యప్రకాశ రావు, రజిని, జె రాజ్ కుమార్, నాగేశ్వరరావు, అమూల్య, నాగేశ్వరరావు, హరిపోతురాజు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధుడు ఏచూరి

అమరావతి: కమ్యూనిస్టు ఉద్యమ నేత కామ్రేడ్ ఏచూరి సీతారాం మృతి భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి తీరని లోటని సీపీఎం సీనియర్ నాయకుడు గుంటుపల్లి కోటేశ్వరరావు అన్నారు. పార్టీ మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ మార్కిస్ట్ మేధావి, ఆర్థిక, తత్వవేత్త సీతారాం ఏచూరి మరణం భారత ప్రజానీకానికి, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అన్నారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నండూరి వెంకటే శ్వరరాజు, మోహిదీన్ వలి, షేక్ నాగుల మేర, టి.కృష్ణ, ఎస్కే రఫీ, ధారా ప్రసాదు, ఎం.చిన్న పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు నిధులు కేటాయించాలి

వినతి పత్రాలు అందజేసిన బడ్జెట్ వాచ్, మాల మహానాడు నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో ప్రభుత్వం త్వరలో ప్రవేశపెడుతున్న 2024–25 వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ క్రింద వివిధ పథకాలకు నిధులు కేటాయించాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వారి కార్యాలయాల్లో కలిసి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాలు అందజేశారు. డాక్టర్ చదలవాడ, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గోదా జాన్ పాల్, మాల మహానాడు నాయకులు ఉస్తెల జయరావు, దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కమిటీ సభ్యులు మేడే వెంకట రమణ, గుండాల మాణిక్యరావు వినతి పత్రాన్ని అందజేశారు.